క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీలో చేరిక



వైఎస్సార్‌సీపీలో చేరిన వెదురువాడ వార్డు సభ్యులతో ఎమ్మెల్యే కన్నబాబు తదితరులు

అచ్యుతాపురం : మండలంలోని వెదురువాడ వార్డు మెంబర్ కిలాడి శివ, పంచదార్ల కరుణ చిన్న, ఊరుకూటి తాతారావు వారి కుటుంబ సభ్యులు గురువారం యలమంచిలి ఎమ్మెల్యే రమణమూర్తిరాజు (కన్నబాబు) సమక్షంలో వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. మాజీ ఎంపీపీ చేకూరి శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు బుద్ధరాజు రాజేశ్ నాయకత్వంలో వీరు వైఎస్సార్‌సీపీలో చేరారు. కార్యక్రమంలో వడిశెట్టి శ్రీను, లాలం శ్రీను, బలిరెడ్డి శ్రీను పాల్గొన్నారు.

ఓటు హక్కుపై అవగాహనకు బైక్ ర్యాలీ



అచ్యుతాపురంలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

అచ్యుతాపురం : ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తూ గురువారం రెవెన్యూ అధికారులు ర్యాలీ నిర్వహించారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారిని మనోరమ నేతృత్వంలో అచ్యుతాపురం తహసీల్దార్ కార్యాలయం నుంచి అచ్యుతాపురం రహదారుల్లో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఓటు హక్కు ప్రాధాన్యతను వివరిస్తూ పోస్టర్‌తో ర్యాలీలో పాల్గొన్నారు.

ఉప్పవరంలో మేలుకొలుపులు



ఉప్పవరంలో మేలుకొలుపులు నిర్వహిస్తున్న భక్తులు

అచ్యుతాపురం: ఉప్పవరంలో ధనుర్మాస మేలుకొలుపులు గురువారం తెల్లవారుజామున నిర్వహించారు. సమరసతా సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో భజనలు చేసుకుంటూ గ్రామంలో సంచరించారు. ఈ కార్యక్రమంలో కొల్లి అప్పారావు, చిన్ని రామునాయుడు తదితరులు పాల్గొన్నారు.

తలంబ్రాల బియ్యం పంపిణీ



తోటాడలో తలంబ్రాల బియ్యాన్ని అందజేస్తున్న దృశ్యం

మునగపాక : మండలంలోని పలు గ్రామాలకు అయోధ్య నుంచి తీసుకువచ్చిన తలంబ్రాల పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిస్తున్నారు. మండల వ్యాప్తంగా పంపిణీ చేసేందుకు మునగపాక సంతబయిల రామాలయానికి తలంబ్రాల బియ్యం వచ్చిన విషయం తెలిసిందే. అక్కడ నుంచి మండలంలోని పలు రామాలయాలకు వేదపండితుల సారథ్యంలో పంపిణీ కార్యక్రమాన్ని గురువారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. పురోహితులు సాయికుమార్, కాండ్రేగుల మణికంఠ పాల్గొన్నారు.

వామనావతారంలో రంగనాథుడు



వామనావతారంలో శ్రీ పాండురంగ స్వామి

పాయకరావుపేట : పట్టణంలో గల శ్రీరాధా రుక్మిణీ సహిత పాండురంగ స్వామి గురువారం వామనావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. దశావతారాల్లో భాగంగా గురువారం వామనాతారం అలంకరణను చేశారు. ఆలయ అర్చకులు యి.కృష్ణస్వామి భక్తులకు తీర్థ ప్రసాదాలను అందించి, పూజలు నిర్వహించారు.

పారదర్శకంగా పింఛన్ల మంజూరు



అచ్యుతాపురం మండల పరిషత్ కార్యాలయం వద్ద కొత్త పింఛన్లు అందజేస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు



మునగపాకలో పింఛన్‌లు అందజేస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు

అచ్యుతాపురం : ఎన్నికల ముందు ఇచ్చిన అన్ని హామీలను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నెరవేర్చారని యలమంచిలి ఎమ్మెల్యే ఉప్పలపాటి రమణమూర్తిరాజు (కన్నబాబు) అన్నారు. అచ్యుతాపురం మండల పరిషత్ కార్యాలయం వద్ద గురువారం కొత్తగా మంజూరైన పింఛన్లు లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సంక్షేమ పథకాలను పారదర్శకంగా అమలు చేస్తూ, ప్రజలకు అండగా ఉంటున్న సీఎం జగన్‌ను మళ్లీ గెలిపించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. గతంలో టీడీపీ అధినేత 400 హామీలు ఇచ్చి అమలు చేయలేక చేతులెత్తేశారని విమర్శించారు. టీడీపీ ప్రభుత్వ చివరి దశలో హడావుడి చేసి రుణ మాఫీ చేస్తామని డ్వాక్రా మహిళల్ని మోసం చేశారని గుర్తు చేశారు. వలంటీర్ వ్యవస్థపై టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌లు చేస్తున్న వ్యాఖ్యలు సరికాదన్నారు. ఈ సందర్భంగా నూతన పింఛన్లను పంపిణీ చేశారు.కార్యక్రమంలో జెడ్పీటీసీ లాలం రాంబాబు, కో ఆప్షన్ జెడ్పీ సభ్యుడు నర్మాల కుమార్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి పిన్నంరాజు వాసు, దుప్పుతూరు సర్పంచ్ దేశంశెట్టి శంకర్‌రావు, వైఎస్సార్‌సీపీ నాయకులు లచ్చన్నాయుడు, వెంకట్ పాల్గొన్నారు.

పింఛను పెంపుపై హామీ నెరవేర్చారు...

మునగపాక : అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్‌లు రాజకీయాలకు అతీతంగా అందజేస్తున్నామని ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తిరాజు (కన్నబాబు) అన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు.

మునగపాక నందీశ్వర తులసీ వేదికపై గురువారం నూతనంగా మంజూరైన పింఛన్‌లతో పాటు పెంచిన పింఛన్ సొమ్మును ఆయన లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా రమణమూర్తిరాజు మాట్లాడుతూ ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంతో పాటు పింఛన్‌ను రూ.3 వేలకు అందజేసిన ఘనత జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. గతంలో పింఛన్‌ల కోసం జన్మభూమి కమిటీల చుట్టూ తిరగాల్సి వచ్చేదని, నేడు ఇంటికే నేరుగా పింఛన్‌లు అందజేస్తున్నామన్నారు. ప్రజలకు మేలు చేసే జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి గెలిపించాలన్నారు.

జగనన్నను మళ్లీ సీఎం చేసుకోవాలి

వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో ప్రతిపక్షాలన్నీ గుంపుగా వస్తాయని, వారికి బుద్ధి చెప్పి ప్రజలంతా జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలన్నారు. డీఎల్‌డీవో మంజులావాణి, డీసీసీబీ మాజీ ఛైర్మన్ సుకుమారవర్మ, సర్పంచ్ దిమ్మల అప్పారావు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు, ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, జెడ్పీటీసీ పెంటకోట స్వామి సత్యనారాయణ, సచివాలయాల మండల కన్వీనర్ గణేష్, పార్టీ అధికార ప్రతినిధి కాశీబాబు, ఎంపీటీసీలు రాము, గణేష్ పాల్గొన్నారు. కొత్తగా 118 మంది లబ్ధిదారులకు రూ.3వేల వంతున పింఛన్ అందజేశారు.

అభివృద్ధి చేస్తా..ఆశీర్వదించండి



కోటవురట్లలో కొత్తగా మంజూరైన పింఛను అందిస్తున్న నియోజకవర్గ ఇన్‌ఛార్జి కంబాల జోగులు



ధాన్యం కొనుగోలు ప్రారంభించిన కంబాల జోగులు



ఎస్.రాయవరంలో నూతన పింఛన్లు అందజేస్తున్న కంబాల జోగులు

కోటవురట్ల: పాయకరావుపేట నియోజకవర్గానికి ప్రత్యేకత వచ్చేలా అభివృద్ధి చేస్తానని, అందుకు అందరి సహకారం తనకు అందివ్వాలని రాజాం ఎమ్మెల్యే, పాయకరావుపేట నియోజకవర్గ సమన్వయకర్త కంబాల జోగులు కోరారు. పాయకరావుపేట నియోజకవర్గ సమన్వయకర్తగా నియమితులైన ఆయన మండలంలోని ముఖ్యనాయకులను గురువారం కలుసుకున్నారు. మాజీ ఎమ్మెల్సీ డి.వి.సూర్యనారాయణరాజు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి ఆర్.ఎస్.సీతారామరాజు, డీసీసీబీ మాజీ ఛైర్మన్ ఆర్.ఎస్.రామచంద్ర రాజు, ఆర్.ఎస్.పెద సీతబాబు, జెడ్పీటీసీ సిద్ధాబత్తుల ఉమాదేవిని కలుసుకుని ముఖ్య నాయకులను పరిచయం చేసుకున్నారు. ఆర్బీకేలో ధాన్యం కొనుగోలును ప్రారంభించారు. కొత్తగా మంజూరైన పింఛన్లను పెరిగిన నగదును లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దివంగత ముఖ్యమంత్రి, మహానేత వైఎస్సార్ దీవెనలు, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆశీస్సులతో రెండు సార్లు ఎమ్మెల్యేగా ప్రజలు తనకు అపూర్వ విజయాన్ని అందించారన్నారు. మూడోసారి పాయకరావుపేట నియోజకవర్గ ప్రజల ఆశీస్సులు తనకు అందివ్వాలని అభివృద్ధి చేసి చూపిస్తానని అన్నారు. ఇక్కడ తంగేడు పెద్దలతో పాటు నాలుగు మండలాల నాయకులు తనకు అండగా నిలవాలని కోరారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు అవ్వాతాతలకు కొండంత భరోసాగా నిలిచి రూ.3 వేలకు పింఛను నగదును పెంచారన్నారు. దేశంలో అత్యధిక పింఛను నగదు ఇస్తున్న ప్రభుత్వంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నిలిచిందన్నారు. మిచాంగ్ తుపానుతో పంట తీవ్రంగా నష్టపోగా సీఎం జగన్ రైతులకు అండగా నిలిచారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ అప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు శ్రీనివాసరావు, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ, సర్పంచ్ అనిల్‌కుమార్, ఎంపీటీసీ వి.రాంబాబు, పార్టీ నాయకులు సిద్ధాబత్తుల సత్యనారాయణ, సత్యనారాయణరాజు, మాజీ జెడ్పీటీసీ వెంకటలక్ష్మి, ఎంపీడీవో కాశీవిశ్వనాథరావు, సర్పంచులు, ఎంపీటీసీలు, ముఖ్యనాయకులు పాల్గొన్నారు.

పార్టీకి కార్యకర్తలే వెన్నెముక

ఎస్.రాయవరం : పార్టీకి కార్యకర్తలే వెన్నుముక అని పాయకరావుపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్, రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. మండల కేంద్రంలో కార్యకర్తల పరిచయ వేదికలో ఆయన పాల్గొన్నారు. ఎంపీపీ కోన లోవలక్ష్మి, జెడ్పీటీసీ కాకర దేవి, మండల పార్టీ అధ్యక్షుడు బొలిశెట్టి గోవిందరావు సమక్షంలో సమావేశమైన జోగులు కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. ఎమ్మెల్యేలుగా తాము ఎంత మంది మారినా పార్టీకి కార్యకర్తలే కీలకమని, కార్యకర్తల అభిప్రాయాలు మేరకు తాము నిర్ణయాలు తీసుకుంటామని చెప్పారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి పేదవాడికి చేరువయ్యేలా సంక్షేమ పథకాలు పెట్టారని, ఇప్పుడు ఎన్నికల ముందు జగనన్న చేసిన మంచిని మరో మారు వివరించి ఓటు అడిగే ప్రయత్నం చేయాలని సూచించారు. ఈ సందర్భంగా బొలిశెట్టి గోవిందరావు పార్టీ నాయకులతో తొలిసారిగా మండలానికి విచ్చేసిన జోగులకు ఘన స్వాగతం పలికారు. దుస్సాలువాతో సత్కరించి మొక్కను అందించారు. అనంతరం నూతనంగా విడుదలైన పింఛన్లు లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా పార్టీ అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ డీవీ సూర్యనారాయణరాజు, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ, మాజీ ఎంపీపీ బొలిశెట్టి శారదాకుమారి, జిల్లా పార్టీ కార్యదర్శి కొణతాల శ్రీనివాసరావు, సర్పంచ్‌లు భూపతి అప్పారావు, పాలపర్తి పాపారావు, శానాపతి శ్రీరాములు, ఎంపీటీసీలు బాలం సూరిబాబు, బైపా శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు వియ్యపు వరహాలరావు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి దత్తుడు సీతబాబు పాల్గొన్నారు.

టెన్త్‌లో శతశాతం ఉత్తీర్ణత సాధించాలి



ఎస్.రాయవరం పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న డిప్యూటీ డీఈవో అప్పారావు

ఎస్.రాయవరం : పదో తరగతి విద్యార్థులు శతశాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని డిప్యూటీ డీఈవో పి.అప్పారావు అన్నారు. మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలను గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల సబ్జెక్ట్ పరిజ్ఞానాన్ని తనిఖీ చేసి మెరుగుపరచాలని ఆదేశించారు. ప్రభుత్వం విద్యా వ్యవస్థపై ప్రత్యేక దృష్టి పెడుతోందని, వాటికి అనుగుణంగా ఉపాధ్యాయులు పని చేయాల్సిందేనని చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రధానోపాధ్యాయులు సత్యనారాయణ, పీడీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి అవార్డు గ్రహీతకు సత్కారం



అవార్డు గ్రహీతను సత్కరిస్తున్న ఏపీటీఎఫ్ సభ్యులు

ఎస్.రాయవరం : సైన్స్ ఫెయిర్‌లో వ్యక్తిగత కేటగిరిలో రాష్ట్ర స్థాయి అవార్డు తీసుకున్న ఉపాధ్యాయుడు రఘు రమేష్‌ను ఏపీటీఎఫ్ ఉపాధ్యాయ బృందం ఘనంగా సత్కరించారు. కొరుప్రోలు పాఠశాలలో సైన్స్ ఉపాధ్యాయునిగా పని చేస్తున్న రఘు రమేష్‌కి ఇటీవల రాష్ట్ర స్థాయి అవార్డు వచ్చింది. గ్రామీణ ప్రాంతంలో పాఠశాలలో ఉపాధ్యాయులకు రాష్ట్ర స్థాయి అవార్డు రావడం అభినందనీయమని జిల్లా ఏపీటీఎఫ్ అధ్యక్షుడు కర్రి ధర్మారావు అన్నారు. ఈ సందర్భంగా కొరుప్రోలు పాఠశాలలో ఆయనను దుస్సాలువాతో సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘ నాయకులు సునీల్, జి.నాగేశ్వరరావు, జగన్, సత్యనారాయణ, ధామస్ పాల్గొన్నారు.

మద్యం సీసాలు పట్టివేత

కోటవురట్ల : అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఓ వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. ఎస్ఐ నారాయణరావు తెలిపిన వివరాల ప్రకారం రాజుపేట శివారు రామన్నపాలెంలో విశ్వసనీయ సమాచారంతో పోలీసులతో కలసి ఎస్ఐ దాడి చేయగా గ్రామానికి చెందిన గుమ్మిడి పెద లోవరాజు అనే వ్యక్తి మద్యం విక్రయిస్తూ పట్టుబడ్డాడు. అతని నుంచి 5 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని అరెస్టు చేసినట్టు ఎస్ఐ తెలిపారు. పండగ నేపథ్యంలో కోడి పందాలు, పేకాట ఆడినా, మద్యం విక్రయించినా చట్టపరంగా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎక్కడైనా ఇటువంటి అసాంఘిక కార్యకలాపాలు చోటు చేసుకుంటే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

విద్యలో సాంకేతిక విప్లవం



విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేస్తున్న ఎంపీపీ బోదెపు గోవింద్

యలమంచిలి రూరల్: ఏటికొప్పాక జడ్పీ హైస్కూల్‌లో గురువారం ఎంపీపీ బోదెపు గోవింద్ విద్యార్థులకు బైజూస్ ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ట్యాబ్‌లతో పాటు జగనన్న గోరుముద్దకు సంబంధించిన కొత్త వంట పాత్రలను కూడా ఏజెన్సీ నిర్వాహకులకు అందజేశారు. జెడ్పీటీసీ సంధ్యారాణి, వైఎస్సార్‌సీపీ నాయకుడు రాము, మండల పార్టీ అధ్యక్షుడు త్రినాథరావు, కన్వీనర్ వీసం వాసు, విశ్వేశ్వరరావు, స్కూల్ కమిటీ చైర్మన్ దేవరపల్లి రమణ, ప్రసాద్, బంగారుబాబు పాల్గొన్నారు.

సీఎం జగన్‌కు క్షీరాభిషేకాలు



సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న లబ్ధిదారులు



అప్పన్నపాలెంలో జగనన్నకు క్షీరాభిషేకం చేస్తున్న లబ్ధిదారులు

రాంబిల్లి: మండలంలో పింఛన్ల పంపిణీ గురువారం పండగలా సాగింది. అప్పన్నపాలెం, కొత్తపేట, గోకివాడ తదితర గ్రామాల్లో జగనన్న చిత్ర పటానికి లబ్ధిదారులు , ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు క్షీరాభిషేకం చేశారు. రూ 3వేలు పెన్షన్ పెంచిన జగనన్నకు లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు.

యలమంచిలి రూరల్ : దేశంలోనే అవ్వాతాతలు, వితంతువులు, వికలాంగులకు రూ.3వేలు చొప్పున పింఛన్ ఇస్తున్న ఏకైక రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని,ఈ ఘనత ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎంపీపీ బోదెపు గోవింద్ అన్నారు.గురువారం యలమంచిలి మండలంలోని ఏటికొప్పాక,పులపర్తి ,లైనుకొత్తూరు, కృష్ణాపురం సచివాలయాల పరిధిలో వైఎస్సార్ పింఛన్ కానుక సొమ్మును లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల ముందిచ్చిన హామీ మేరకు పింఛన్ సొమ్మును 3వేల రూపాయలకు పెంచి సీఎం జగనన్న హామీ నెరవేర్చారన్నారు. పలు చోట్ల సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటాలకు లబ్ధిదారులు క్షీరాభిషేకాలు చేశారు. మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు త్రినాథరావు, సేనాపతి రాము పాల్గొన్నారు.

అపరాల సాగుపై అవగాహన

రాంబిల్లి: మామిడివాడ ఆర్‌బీకే వద్ద గురువారం అపరాల సాగుపై వ్యవసాయ అధికారులు అవగాహన కల్పించారు. హరిపురం కేవీకే శాస్త్రవేత్త వాన ప్రసాదరావు, రైతు శిక్షణ కేంద్రం ఏవో విజేత, రాంబిల్లి ఏవో సుమంత అపరాల సాగు విధానం, ఎరువుల యాజమాన్యంపై వివరించారు. సర్పంచ్ అప్పలనర్స, వైఎస్సార్‌సీపీ నాయకులు సన్యాసిరావు, సత్యనారాయణ, నాగరాజు పాల్గొన్నారు.

ఇంటి ముందు నిలిపిన బైక్ చోరీ

యలమంచిలి రూరల్ : ధర్మవరానికి చెందిన నూతి విజయ్‌కుమార్ గురువారం తన వ్యాపార పనులపై లైనుకొత్తూరులో ఓ ఇంటి వద్ద తన డ్యూక్ బైక్‌ను పార్క్ చేసి లోపలికి వెళ్లారు. కొద్దిసేపటి తర్వాత తిరిగి వచ్చేసరికి అక్కడ నిలిపి ఉంచిన బైక్ కనిపించలేదు. చుట్టుపక్కల వెతికినా ప్రయోజనం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ పాపినాయుడు చెప్పారు.

బ్రాండిక్స్ ఉద్యోగులకు నాణ్యమైన ఆహారం



బ్రాండిక్స్ ఉద్యోగులకు ఆహారం వడ్డిస్తున్న దృశ్యం

అచ్యుతాపురం : బ్రాండెక్స్‌లోని ఉద్యోగులకు నాణ్యమైన, రుచికరమైన భోజనం అందించేందుకు ఎంత ఖర్చుకయినా వెనుకాడడం లేదని బ్రాండిక్స్ భారత భాగస్వామి దొరైస్వామి తెలిపారు. బ్రాండిక్స్ అపారల్ పార్కులోని అక్షయపాత్ర కిచెన్ రూమ్‌ను సందర్శించిన ఆయన కార్మికులతో మాట్లాడారు. ఐదు కోట్ల రూపాయల వ్యయంతో ఎకరా స్థలంలో అక్షయ పాత్ర సంస్థ ద్వారా వండే ఆహారాన్ని బ్రాండిక్స్‌లోని అన్ని యూనిట్లకు పంపిస్తున్నామని తెలిపారు. ఆహారం వండుతున్న విధానం, నాణ్యత వంటి అంశాలపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట అక్షయ పాత్ర ఫౌండేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ భక్తదాస ప్రభు ఉన్నారు.

రైతుల కమతాల చెంతకే శాలిహోత్ర ఎక్స్‌ప్రెస్ సేవలు



అరబుపాలెంలో శాలిహోత్ర ఎక్స్‌ప్రెస్‌ను ప్రారంభిస్తున్న సంజయ్‌ప్రకాష్

మునగపాక : రైతుల కమతాల చెంతకే పశువైద్య సేవలందించేందుకు శాలిహోత్రా ఎక్స్‌ప్రెస్ దోహదపడుతుందని ఎస్‌బీఐ ఫౌండేషన్ మేనేజింగ్ డైరెక్టర్ సంజయ్ ప్రకాష్ అన్నారు. మండలంలోని అరబుపాలెం గ్రామంలో ఎస్‌బీఐ ఫౌండేషన్ అలాగే బైఫ్ భాగస్వామ్యంతో గురువారం రైతులకు ప్రయోజకారిగా ఉండే శాలిహోత్ర ఎక్స్‌ప్రెస్ వాహనాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశుపోషణ గ్రామీణ జీవనోపాధిలో అంతర్భాగమేనన్నారు. రైతులను ఆదుకోవడమే లక్ష్యంగా శాలిహోత్ర ఎక్స్‌ప్రెస్ ఉపయోగకరంగా ఉంటుందన్నారు. అనకాపల్లి జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి బి.ప్రసాదరావు మాట్లాడుతూ రైతుల ప్రయోజనార్థం ఎస్‌బీఐ ఫౌండేషన్ అందిస్తున్న సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. శాలిహోత్ర వాహనం ప్రతి గ్రామానికి వెళ్లి సంప్రదాయ పద్ధతిలో కృత్రిమ గర్భధారణతో సహా సరికొత్తగా పశువైద్య సేవలందిస్తుందన్నారు. రైతులు ఎదుర్కొంటున్న సవాల్‌ను దృష్టిలో ఉంచుకొని బైఫ్ సౌజన్యంతో వాహన సదుపాయం కల్పించినట్టు బైఫ్ ప్రతినిధి గోపాలరెడ్డి తెలిపారు. ఎస్‌బీఐ అనకాపల్లి రీజనల్ ఆఫీస్ చీఫ్ మేనేజర్ రవికుమార్, మునగపాక ఎస్‌బీఐ మేనేజర్ శ్రీవల్లి, సర్పంచ్ బొడ్డేడ శ్రీనివాసరావు కార్యక్రమంలో పాల్గొన్నారు.

రహదారి కష్టాలకు చెల్లు



పాటిపల్లి నుంచి గొల్లపేటకు వెళ్లేందుకు నూతనంగా నిర్మించిన రోడ్డు



నూతనంగా నిర్మించిన పాటిపల్లి బీసీ కాలనీకి వెళ్లే రోడ్డు

మునగపాక : గతంలో పలు గ్రామాలకు వెళ్లే రహదారులు అధ్వానంగా ఉండేవి. దీంతో రాకపోకలు సాగించేవారు అవస్థలు ఎదుర్కొనేవారు. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో రహదారుల అభివృద్ధిపై దృష్టి సారించారు. ఏళ్ల తరబడి పరిష్కారానికి నోచుకోని రహదారులు నేడు అద్దంలా దర్శనమిస్తున్నాయి. పాటిపల్లి బీసీ కాలనీ నుంచి కట్టవానిపాలెం వయా కాకరాపల్లి మీదుగా రాజుపేటకు వెళ్లేందుకు నాబార్డ్ రూ.253.57 లక్షల మేర నిధులు మంజూరు చేశారు. ఈ నిధులతో రహదారుల నిర్మాణాలు పూర్తయ్యాయి. దీంతో ఆయా గ్రామాల మీదుగా రాకపోకలు సాగించేవారు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇన్ని రోజులకు తమ ఇబ్బందులు తొలగిపోవడంతో వాహనదారుల నుంచి మంచి స్పందన వస్తుందనడంలో సందేహం లేదు.

ఘనంగా మార్గశిర పూజలు



అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

యలమంచిలి : పట్టణంలోని ధర్మవరం కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయం మార్గశిర మాసం ఆఖరి గురువారం నాడు భక్తులతో కిటకిటలాడింది. ఉదయం నుంచి సాయంత్రం వరకూ అమ్మవారిని దర్శించుకోవడానికి భక్తులు తరలివచ్చారు. క్యూలైన్లలో నిలబడి అమ్మవారిని దర్శించుకున్నారు. పసుపు, కుంకుమలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. గురువారం వేకువజాము నుంచే మహిళలు అమ్మవారి ఆలయానికి వచ్చి ప్రత్యేక అభిషేకాల్లో పాల్గొన్నారు. అంతకుముందు ఆలయ అర్చకులు కోటి పంతులు భక్తుల గోత్రనామాలతో శాస్త్రోక్తంగా పూజలు చేశారు. అష్టోత్తర శతనామార్చన, శ్రీసూక్తం, దుర్గాసూక్తంతో పూజలు చేసి, ధూప, దీప, నైవేద్య నీరాజన మంత్ర పుష్పాలు సమర్పించారు.

సెక్టోరియల్ అధికారుల విధులు కీలకం



అధికారులకు సూచనలిస్తున్న ఈఆర్వో మనోరమ

యలమంచిలి రూరల్ : ఎన్నికల నిర్వహణలో కొత్తగా నియమించబడిన సెక్టోరియల్ అధికారుల పాత్ర, విధులు ఎంతో కీలకమని నియోజకవర్గ ఎలక్టోరల్ నమోదు అధికారిణి కె.మనోరమ అన్నారు. గురువారం యలమంచిలి ఎంపీడీవో కార్యాలయంలో సెక్టోరియల్ అధికారులకు జరిగిన శిక్షణ సమావేశంలో ఆమె పలు సూచనలిచ్చారు. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో నియోజకవర్గంలో ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహణకు అధికారులు సమాయత్తం కావాలన్నారు. వారి పరిధిలో ఉన్న పోలింగ్ కేంద్రాలను క్షుణ్ణంగా తనిఖీ చేసి మౌలిక సదుపాయాలపై రెండ్రోజుల్లోగా నివేదిక అందజేయాలని సూచించారు. సార్వత్రిక ఎన్నికలు ముగిసే వరకూ విధి నిర్వహణ పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. సమస్యాత్మక కేంద్రాలకు సంబంధించి ఎప్పటికప్పుడు తాజా సమాచారాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకొచ్చి, అల్లర్లకు కారకులైనవారిని గుర్తించి పాత నిందితులు ఉంటే బైండోవర్ చేయాలన్నారు. సమావేశంలో యలమంచిలి, రాంబిల్లి తహసీల్దార్లు ఎస్.రాణీఅమ్మాజీ, పి. భాగ్యవతి, యలమంచిలి ఎంపీడీవో కె.అప్పలనాయుడు, 21 మంది సెక్టార్ అధికారులు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలపై గ్రామాల్లో ప్రచారం



వికసిత్ భారత్ పోస్టర్‌ను ప్రదర్శిస్తున్న నాయకులు

పాయకరావుపేట : పాల్మన్‌పేట గ్రామంలో గురువారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాన్ని అధికారులు నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలపై గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నారు. ఎంపీడీవో ఎ.సాంబశివరావు ఆధ్వర్యంలో మండల స్థాయి అధికారులు కార్యక్రమానికి హాజరయ్యారు. ఐసీడీఎస్, ఎన్ఆర్ఈజీఎస్ ఆయుష్మాన్ భవ, తదితర కేంద్ర ప్రభుత్వం కల్పిస్తున్న పథకాలపై ఆయా శాఖల మండల స్థాయి అధికారులు గ్రామస్తులకు వివరించి అవగాహన కల్పించారు. అనంతరం వికసిత్ భారత్ పోస్టర్‌ను ప్రదర్శించారు. సర్పంచ్ కోడ కోటేశ్వరరావు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

నేడు జగనన్న ఆరోగ్య సురక్ష

ఎస్.రాయవరం : గుడివాడ సచివాలయంలో శుక్రవారం రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రారంభిస్తున్నట్టు ఎంపీడీవో రామ చంద్రమూర్తి తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు, ఇన్‌చార్జ్ కంబాల జోగులు, జిల్లా పార్టీ అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ తదితరులు హాజరౌతారని తెలిపారు.